క్లుప్తంగా

శానిటేషన్ విషయంలో రాజీ పడేది లేదు

• మున్సిపల్ కమిషనర్ రవిబాబు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం: శానిటేషన్ విషయంలో రాజీపడే ప్రసక్తిలేదని మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు పేర్కొన్నారు. శానిటరీ సెక్రటరీలతో తన కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో కాలువలు, జంక్షన్లను పరిశుభ్రంగా ఉండేటట్లు శానిటరీ సెక్రటరీలు బాధ్యత తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కొబ్బరి వ్యాపారులు ఎక్కడబడితే అక్కడ కొబ్బరి బొండాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పురపాలక సంఘం పరిధిలో ఎవరూ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల రీత్యా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. హోటల్స్, టీ షాపుల్లో వేడి నీటిని మాత్రమే ఉపయోగించే విధంగా యజమానులకు సూచించాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



వల్సంపేటలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: నిబంధనల ప్రకారమే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ ఉండాలని ఎంపీడీవో జాగరల రాంబాబు అన్నారు. వల్సంపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి స్టాకుతోపాటు చిన్నారులు వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నా. మెనూ విధిగా అమలు చేయాలని, నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయన్నారు. తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా ఈ వారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలని సూచించారు.

ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ



వెంకటరమణ

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది కనకదుర్గ ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా కోవెల వెంకటరమణ ఎన్నికయ్యాడు. శుక్రవారం పలు గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లు సంఘ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటరమణను సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ బలోపేతా నికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పలువురు ఆటోడ్రైవర్లు అభినందించారు.

గోతులు పూడ్చివేత



రోడ్డుపై గోతులు పూడ్చుతున్న దృశ్యం

గొలుగొండ: కృష్ణదేవిపేట–నర్సీపట్నం మార్గంలో లింగంపేట, గుజ్జుమానుపాకల వద్ద ప్రధాన రోడ్డుపై గోతులను తాత్కాలికంగా పూడ్చారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ తన సొంత నిధులు ఖర్చు చేసి శుక్రవారం పలు చోట్ల గోతుల్లో చిన్నపిక్క వేసి రోలింగ్ చేయించారు. వీటిని పూడ్చడం వల్ల వాహనచోదకులకు ప్రయాణం సాఫీగా సాగనుంది.

అప్పలరాజుపురంలో పారిశుధ్య పనులు



ట్రాక్టర్లులోకి చెత్త వేస్తున్న దృశ్యం

చీడికాడ: అప్పలరాజుపురం పంచాయతీలో రెండు రోజులుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వి.రాజేంద్ర మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువల్లో పూడిక తీతతోపాటు వీధుల్లో చెత్తా చెదారాలు తొలగిస్తున్నామన్నారు. గ్రామానికి ఆనుకున్న ప్రధాన రహదారుల్లో, ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారాలు వేయొద్దన్నారు.



మాకవరపాలెం:గిడుతూరులో గర్భిణులు, బాలింతలకు అవగాహన



నాతవరం: తల్లులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



బుచ్చెయ్యపేట: మంగళాపురంలో తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తున్న సిబ్బంది

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

నవజాత శిశువుకు తల్లి పాలే తొలి టీకా.. జన్మించిన వెంటనే పట్టే ముర్రుపాలే బిడ్డకు పోషణ ఆరోగ్యం.. కొందరు అపోహతో శిశువుకు ముర్రుపాలు పట్టేందుకు అయిష్టత చూపడంతో భవిష్యత్తులో అనారోగ్యం బారిన పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో తల్లిపాల విశిష్టతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు.



• నవజాత శిశువుకు రోగనిరోధక శక్తి వృద్ధి
• బిడ్డకు పాలిస్తే అమ్మకూ ఆరోగ్యం
• తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ



రోలుగుంట: పెదపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు



నాతవరం: వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నాతవరం: తల్లి పాల ప్రాముఖ్యత గురించి ప్రతి తల్లి కనీస అవగాహన కలిగి ఉండాలని గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం -1లో శుక్రవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆధునిక పోకడకు పోయి అందం తగ్గిపోతుందని అపోహతో గ్రామాల్లో నేటికి కొందరు తల్లులు ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అలాంటి వారిలో చైతన్యం తీసుకురావడానికే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. తల్లి పాలు బిడ్డకు ఆర్నెల్ల వరకు ఇవ్వడం వల్ల తల్లికి బిడ్డకు మధ్య అనుబంధం మరింత ఏర్పడుతుందన్నారు. తల్లికి గర్భ సంచి యథాస్థితికి వస్తుందన్నారు. అండాశయ క్యాన్సర్ రాదన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణుల సందేహాలను నివృత్తి చేశారు. హెచ్‌ఎం నూకరత్నం, ఐసీడీఎస్ నాతవరం, వై.డి.పేట సెక్టారు సూపర్‌వైజర్లు విజయలక్ష్మి నాగజ్యోతి, కార్యకర్తలు రాజేశ్వరి, వసంత, సత్యవతి, వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: తల్లిపాలతో బిడ్డకు ఎంతో ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమణమ్మ తెలిపారు. గిడుతూరు సెక్టార్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలు పట్టడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలన్నారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రుపాలు గంటలోపే బిడ్డకు అందించండి

బుచ్చెయ్యపేట: తల్లి ముర్రుపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తుల్లులకు, గర్భిణులకు తల్లి పాల ఆవశ్యకత గురించి వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి పాలు అందించాలన్నారు. ఆర్నెల్ల వరకు తప్పనిసరిగా తల్లి పాలు అందించాలన్నారు. బుచ్చెయ్యపేట, వడ్డాది తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రవణమ్మ సిబ్బంది రూపావతి, మహలక్ష్మి, కార్యకర్త రాధ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

కె.కోటపాడు: పుట్టిన అరగంటలోగా బిడ్డకు తల్లి పాలను తప్పనిసరిగా ఇవ్వాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. శుక్రవారం రొంగలినాయుడుపాలెంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నిర్మల మాట్లాడుతు తల్లిపాలలో అధిక పోషక విలువలు ఉంటాయన్నారు. వ్యాధినిరోధక శక్తికి, చిన్నారులు అంటువ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. తల్లిపాల ద్వారా బిడ్డకు వయసుకు తగ్గ ఎదుగుదల ఉంటుందన్నారు. డబ్బా పాలను దూరం చేసి తల్లిపాలను విధిగా బాలింతలు అందించాలని సూచించారు. పీహెచ్‌ఎన్ కనకవేణి, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్‌ఎం సత్యవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.చెల్లయ్యమ్మ, ఈశ్వరమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో తల్లిపాల వారోత్సవాలను రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎం.కె.పట్నం శివారు పెదపేట గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి, చిన్నారులు, వారి తల్లులతో కలిసి ర్యాలీ చేశారు. డబ్బా పాలు వద్దు–తల్లిపాలే ముద్దు, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించండి– వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచండంటూ పలు నినాదాలు చేశారు. గ్రామ మహిళలు, ఆయాలు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: గోవాడలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో వైద్యురాలు సత్యదీపిక తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించాలన్నారు. దీని వల్ల బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు ఆప్యాయతతో పాలు ఇవ్వాలన్నారు. ఆరు మాసాల తర్వాత ఆదనపు ఆహారం ఇవ్వాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో రవికుమార్, ఎంఎల్‌పీహెచ్‌వో పి. వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ అసిస్టెంట్ జగన్, ఆయాలు పాల్గొన్నారు.



కె.కోటపాడు:రొంగలినాయుడుపాలెంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో వైద్యాధికారి నిర్మల



తల్లి పాల ప్రాముఖ్యత గురించి మాట్లాడుతున్న వైద్యురాలు సత్య దీపిక

రేపు ఉచిత వైద్య శిబిరం

మాడుగుల: స్థానిక విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యుడు గౌరీపట్టపు మహేష్‌కుమార్ తెలిపారు. అన్ని రకాల కీళ్లనొప్పులు, దీర్ఘకాలిక సమస్యలకు ఉచితంగా పరీక్షించి మందులు అందజేయనున్నారన్నారు. అవసరమైన వారికి విశాఖపట్నం తీసుకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారన్నారు.

ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ

• మర్రివలస పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో ప్రసాద్



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: పాఠశాలలో ప్రతీ విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. మర్రివలస ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 29 మంది విద్యార్థుల చదువులపై ఆయన ఆరా తీశారు. చదువుల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రుల సమావేశాల్లో ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, వేడివేడిగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు రక్తహీనత సమస్య లేకుండా ప్రతీ మూడు నెలలకు ఒకసారి హెచ్‌బీ పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనత సమస్య గల వారికి ఐరన్ మాత్రలను అందించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్‌ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక కుంకుమ పూజలు



వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో కింతలి– గాదిరాయి వాసవీ క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



జాతీయ జెండాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శుక్రవారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం కోసూరు రాము మాట్లాడుతూ పింగళి వెంకయ్య మన తెలుగువారు కావడం అందరికీ గర్వకారణమన్నారు. కాకినాడలో మహాత్మా గాంధీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా పింగళి వెంకయ్య జాతీయ పతాక నమూనాను అందిచారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

ఉత్తమ పంచాయతీల ఎంపికకు క్షేత్రస్థాయి పరిశీలన



క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలున్న నాలుగు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని ఎంపీడీవో జాగరల రాంబాబు తెలిపారు. మండలంలో వల్సంపేట, వై.బి.అగ్రహారం, పెదగొలుగొండపేట, పి.కె.గూడెం పంచాయతీల్లో శుక్రవారం సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో శత శాతం మరుగుదొడ్లు, విద్య, వైద్యం, తాగునీటి సదుపాయం, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంతవరకు చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు కలెక్టరుకు నివేదిక పంపిస్తామన్నారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైతే ప్రభుత్వం నుంచి పురస్కారాలతోపాటు మరింత అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరవుతాయన్నారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని మిగిలిన పంచాయతీ పాలక వర్గాల సభ్యులు, అధికారులు సంయుక్తంగా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్, పంచాయతీ విస్తరణాధికారి ఎన్.ఎన్.వి.మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

99.36 శాతం పింఛన్ల పంపిణీ



విశాఖ కేజీహెచ్‌లో వెంకట శ్రీరామూర్తికి పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

మాడుగుల రూరల్: మండలంలో రెండు రోజుల వ్యవధిలో 11,723 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 11,803 మందికిగాను 11,723 మంది పింఛనుదారులకు పింఛన్లు పంపిణీ చేసి 99.36 శాతం పూర్తి చేశామన్నారు. మరో 80 మందికి పింఛనుదారులకు గాను 39 మంది పింఛనుదారులు మృతి చెందగా, 19 మంది వేర్వేరు గ్రామాలకు వెళ్లిపోగా, 19 మంది తాత్కాలికంగా, మరో ముగ్గురు పూర్తిగా వలస పోయారన్నారు. 80 మందికి సంబంధించిన పింఛను నగదును తిరిగి బ్యాంకుకు చెల్లిస్తామన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి...

బుచ్చెయ్యపేట: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న పలు గ్రామాలకు చెందిన పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ నగదు బట్వాడా చేశారు. కందిపూడికి చెందిన సీతా వెంకట శ్రీరామూర్తి విశాఖ కేజీహెచ్‌లోను, ఎం మాణిక్యం అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలోను అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతున్నారు. పింఛన్ల పంపిణీ రెండో రోజు శుక్రవారం వీరిద్దరికి సచివాలయ సిబ్బంది నగదు అందించారు. వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న కాళ్ల గణేశమ్మ, మాటూరి రమణలకు సచివాలయ సిబ్బంది పింఛన్ నగదు అందించారు.

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు

• గోడాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్రాజెక్టుకు ప్రతిపాదన
• సర్వసభ్య సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు వేదికపై ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం



విద్యుత్ సమస్యపై ఏఈ శంకరరావును ప్రశ్నిస్తున్న బి. కింతాడ సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి: పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికోడ్ నిబంధనలను అనుసరించి శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోవాడ చక్కెర కర్మాగారంలో చెరకుతో ఇథనాల్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని, రైతులంతా అంగీకరిస్తే కార్యాచరణ చేపడతామన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అన్ని ప్రభుత్వ భవనాలు, రోడ్డు నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. అంగన్‌వాడీ భవనాలకు స్థలాలు కేటాయిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల స్థితిగతుల పూర్తి వివరాలను అందించాలని ఈవోపీఆర్డీ జి. సంతోషి నళినిని ఆదేశించారు. సంపద తయారీ కేంద్ర పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారని ఫిర్యాదు చేసినా ఉపాధి హామీ అధికారులు పట్టించుకోలేదని ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బోయిలకింతాడలో ఓల్టా చట్టం నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ మోటారుకు ఫారం–3 ఇచ్చారని, విద్యుత్ కనెక్షన్ నిలుపుదల చేయాలని, తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా కనెక్షన్ ఎలా ఇచ్చారని ట్రాన్స్‌కో ఏఈ శంకరరావును సర్పంచ్ బూరె బాబూరావు ప్రశ్నించారు. ఎం. అలమండలో ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని సర్పంచ్ దాడి జగన్, ఎం. అలమండ–మామిడిపల్లి మధ్య లింక్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడు కోరారు. రైవాడ, తిమిరాం, కలిగొట్ల సర్పంచ్‌లు, మామిడిపల్లి, ఎం. అలమండ ఎంపీటీసీలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలు, రాయితీలను వివరించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, ఎంపీడీవో ఎస్. అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ పాల్గొన్నారు.

కె.జె.పురంలో ఫాగింగ్



ఫాగింగ్ ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఈ నెల 4వ తేదిన మోదకొండమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దోమల నివారణలో భాగంగా ఫాగింగ్ చేశారు. సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజు పర్యవేక్షణలో గ్రామమంతా దోమల నివారణకు గాను ఫాగింగ్ చర్యలు తీసుకున్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



ప్రిన్సిపాల్ రాధ, విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.12 వేలు విలువ చేసే సామగ్రిని పూర్వ విద్యార్థులు వితరణ చేశారు. ఇక్కడ 2012–2014 ఒకేషనల్ గ్రూపులో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు జామి రాంబాబు, హరిప్రసాద్ గుప్తా, చెల్లారావు, ఆనంద్ శుక్రవారం ప్రిన్సిపాల్ బి. రాధకు సామగ్రిని అందజేశారు. ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 25 మందికి షార్ట్ హ్యాండ్స్ టెక్స్ బుక్స్, టైప్ రైటింగ్ బుక్స్, రికార్డ్ బుక్స్ తదితర స్టేషనరీ సామగ్రిని సమకూర్చారు. గతేడాది ఒకేషనల్‌లో అధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ. 1500 చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సేవా దృక్పథాన్ని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రశంసించారు.

వరినాట్లలో జాగ్రత్తలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో విజయలక్ష్మి

రోలుగుంట: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డసరంలో పొలంబడి నిర్వహించారు. నారుమడుల సంరక్షణ, వరినాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో ఎస్.విజయలక్ష్మి అవగాహన కల్పించారు. సుడోమోనస్ నీటి ద్రావణంలో వరిఆకు వేర్లు గంట సేపు ఉంచి నాట్లు వేసుకోవాలన్నారు. దీని వల్ల 45 రోజుల వరకూ తెగుళ్ల నుంచి పంటకు రక్షణ ఉంటుందన్నారు. ఆఖరి దమ్ములో కాని, నాటిన 30 రోజుల లోపు చాలామంది పొటాషియం వేయడం లేదన్నారు. అలాంటి వారు పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా ద్రావణం మట్టిలో కలిపి పొలంలో బురద పదునులో చల్లుకోవాలన్నారు. దీనివల్ల భూమిలో పోటాషియం విడుదలై పంటకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.